# అనువుగాని చోటు

అమృతరావుని ఆ ఆఫీసులో ఫెయిర్ కాపీయింగ్ సెక్షన్ లో వేసి ఆరెన్నెల్లయింది. గుమాస్తాలు పుటప్ చేసిన లెటర్లు, హుజూర్ హెడ్ క్లర్కుల దగ్గర అప్రూవై టైపుకి వస్తాయి. టైపిస్టులు టైపు చేసిన లెటర్లు వ్రాతప్రతితో కలిసి కంపేరింగ్ సీట్లలోకి వెడతాయి. అక్కడ టైపు చేసిన లెటర్ని వ్రాతప్రతితో పోల్చి చూస్తారు. ఒకటో రెండో అయితే తప్ప ఎక్కువ తప్పులుంటే తిరిగి టైపు చెయ్యమని తిప్పి పంపిస్తారు. ఇవికాక కలెక్టరు, డి. ఆర్. వో లు రాసిన డెమీ అఫీషియల్ (డి. డి.) లెటర్లు కూడా టైపు అయి వస్తాయి

చంద్రమౌళిని కంపేరింగ్ సీట్‌లో వేశారు.

ఆ రోజు....

క్యాంటీన్‌లో ఆరోసారి ‘అర’ కాఫీ తాగి వచ్చి, సిగరెట్ వెలిగించి, సీట్లో కూచున్నాడు. అతనికి కుడి ప్రక్కగా రెండు వరుసలలో టైపిస్టులు కూర్చుని నిర్విరామంగా టైపు చేస్తూ, కొంచెం గట్టిగా చెపితే తప్ప ప్రక్కవాడి మాట కూడా వినిపించనంత శబ్దాన్ని సృష్టిస్తున్నారు. ఎడమప్రక్క సెక్షన్ సూపరింటెండెంటు ఏదో పుస్తకం ముందేసుకుని గంభీరంగా కూర్చున్నాడు. అమృతరావుకి నవ్వొచ్చింది. ఆయనసలు నిద్రపోతున్నాడు. కాని పరీక్షగా చూస్తే తప్ప ఆ విషయం ఎవరికీ తెలీదు. కోతి కునుకు. ఆ విధంగా వున్నవాడు ఉన్నట్లు సీట్లో బిగుసుకుపోయి, రెండోకంటివాడికి తెలీకుండా ఓ కునుకు తీయటం ఆయనకి తప్ప ఆఫీసులో ఇంకెవరికీ చేతకాదు.

టేబుల్ మీద పేపరు వెయిట్ క్రింద పెట్టి వున్న లెటర్‌ని చేతిలోకి తీసుకున్నాడు. కళ్ళు అనాలోచితంగా లెటరు దిగువన టైపిస్టు ఇనిషియల్స్ కోసం వెతికాయి. "ఓ. జి. ఆర్." బాబోయ్ ఓ. జి. ఆర్!

ఈ ఆరెన్నెల్లలో టైపిస్టులలో ఎవరు మంచి టైపిస్టో, ఎవరు కాదో తెలిసిపోయింది అమృతరావుకి. ఉన్న ఎనిమిది మంది టైపిస్టులలోను ఇద్దరే మంచి టైపిస్టులు. తక్కిన వాళ్ళంతా అటు సెక్షన్ సూపరింటెండెంటుకి, ఇటు కంపేరర్స్‌కీ ఏదో విధంగా తలనొప్పి కలిగించే వాళ్ళే. వాళ్ళలో "ఓ.జి.ఆర్." ఉద్దండుడు.

ఫ్యూన్ వచ్చి అర్జెంట్ అని అక్షరాలున్న పాడ్‌ని అమృతరావు ముందు వున్న ట్రేలో పడేసి వెళ్ళాడు. అమృతరావు చూశాడు. అవి కలెక్టరుగారి డి.ఓ. లెటర్, లెటరు కాక అది చేరవలసినవారి అడ్రెస్ కూడా చిన్న కాగితం మీద నీట్‌గా టైపు చేసి వుంది. అడ్రస్ కాగితం పైన "టాప్ టు డే" అని

★ దేవరకొండ మురళి ★

వుంది. లెటర్ ఉంచిన కవరుపైన ఆ అడ్రస్ కాగితాన్ని అతికిస్తారు.

చేస్తున్నపని తాత్కాలికంగా విరమించి పాడ్‌ని చేతిలోకి తీసుకుని రిబ్బను విప్పాడు. కలెక్టరుగారి లెటరు కనుక కొంచెం జాగ్రత్తగా చూడసాగాడు. కళ్ళు మొదట వ్రాత ప్రతి వంక, తర్వాత టైపు చెయ్యబడిన లెటర్‌వంక పరిగెడుతున్నాయి.

ఒకచోట బ్రేక్ పడినట్టు ఆగిపోయాడు అమృతరావు. ఆ వాక్యాన్ని మళ్ళీ చదివాడు. టైపిస్టు ఉన్నదేదో కరెక్టుగానే కొట్టాడు. కాని అసలు ఆ వాక్యమే తప్పు. వాక్యం మధ్యలో రెండుమాటలు ఎగిరిపోయాయి. అవి లేనిదే వాక్యం పూర్తికాదు.

సీట్‌లోంచి లేచివెళ్ళి సెక్షన్ సూపరింటెండెంటుకి చూపించాడు. ఆయన లెటరు చదివాడు. తప్పు ఎక్కడవుందో బోధపడలేదాయనకి. "టైపిస్టు కరెక్టుగానే కొట్టాడే?" అన్నాడు అమృతరావు వంక ప్రశ్నార్థకంగా చూసి.

"అదికాదు, ఈ సెంటెన్స్ తప్పు. ఇక్కడ కన్‌స్ట్రక్షన్ కుదరలేదు." అని చూపించాడు అమృతరావు.

"ఏమిటీ, కలెక్టరుగారి లెటరే తప్పంటావా?" ఆశ్చర్యంగా అన్నాడు సెక్షన్ సూపరింటెండెంటు పెరుమాళ్ళు. "భలే వాడివే, ఆయన వ్రాసిందాంట్లో మనమేం తప్పు పడతాంగాని, అది అలాగే పంపించెయ్యి. టైపు చేసినంతవరకు కరెక్టుగా వుందో లేదో చూడటమే మనపని" అని తేల్చి చెప్పాడు.

అమృతరావు కేం పాలుపోలేదు. ఆ లెటర్‌ని అలాగే పంపించి వెయ్యటానికీ మనసొప్పలేదు. పైగా అది బోర్డు ఆఫ్ రెవెన్యూలో అసిస్టెంట్ సెక్రటరీకి వెడుతున్న లెటరు.


ఇంతలో కలెక్టరుగారి ప్యూను రానే వచ్చాడు. "అయ్యగారు పాడ్ తెమ్మంటున్నారు" అంటూ.

తనే పాడ్‌ని తీసుకుని వెళ్ళాడు.

ఆ గదిలో అడుగుపెట్టటం అమృతరావుకి మొదటిసారి. ఎయిర్ కండిషన్ లేకపోయినా లోపల ఎందుకో చల్లగా ఉంది. విశాలమైన ఆ గదిలో నాలుగు గోడలకి బ్రిటిష్‌వారి రోజుల్లో పని చేసిన కలెక్టర్ల ఛాయా చిత్రాలున్నాయి. అన్ని చిత్రాలక్రింద పాలీష్‌చేసిన చెక్క ఒకటి ఫ్రేమ్‌లా చుట్టూ వచ్చింది. ఆ వుడెన్ ఫ్రేంమీద ఒక్కొక్క ఛాయా చిత్రం క్రింద వారి పేరు వారు కలెక్టరుగా పని చేసిన కాలం పెయింట్ చేసి వున్నాయి. ఆ గదిని చూడగానే అమృతరావుకి 'లవకుశ' సినిమాలో ఓ దృశ్యం జ్ఞాపకం వచ్చింది. పాత కలెక్టర్ల చిత్రాలన్నీ రఘువంశపురాజులవిగాను,ఆఫీస్ టేబుల్ ముందు కూర్చొనివున్న కలెక్టరుగారు అపర శ్రీరామచంద్రుడిలాను కనపడ్డారు అమృతరావుకి.

పాడ్ తెచ్చినది ప్యూన్ పర్వతాలు కాక మరోవ్యక్తి అవటంతో తలెత్తి "యస్?" అన్నారు కలెక్టరుగారు ప్రశ్నార్థకంగా.

వినయంగా ముందుకి వంగి పాడ్‌ని టేబుల్‌పై ఉంచి తను వచ్చిన కారణం చెప్పాడు అమృతరావు. లెటర్‌లో వాక్యాన్ని చూపించాడు. తను చెపుతుంటే




కలెక్టరుగారి కనుబొమలు క్షణంసేపు ముడిపడటం అమృతరావు గమనించలేదు.

"ఆర్ యూ షూర్ దట్ సెంటెన్స్ ఈజ్ నాట్ కరెక్ట్?" కలెక్టరుగారు కూల్‌గా అడిగారు.

ముందు తటపటాయించి తర్వాత తలవూపాడు.

"అయితే ఆ సెంటెన్స్‌లో ఏం వర్డ్స్ ఇరికిస్తే, సెంటెన్స్ పూర్తవుతుందో కూడా మీరే చెప్పండి" అన్నారు కలెక్టరుగారు శాంతంగా.

అమృతరావు చెప్పాడు.

"గుడ్!" అని కాలింగ్‌బెల్ కొట్టారు. బీడీముక్క పారేసి పడుతూ లేస్తూ పరిగెత్తుకు వచ్చాడు ప్యూన్ పర్వతాలు. లెటర్‌లో మార్పుచేసి పాడ్‌ని ప్యూన్‌కిచ్చి తిరిగి సెప్పుకి పంపారు.

"వెల్!" అమృతరావుకి షేక్‌హాండ్ ఇచ్చారు కలెక్టరుగారు.

"యు ఆర్ ఫాస్ట్ ఇన్ ఇంగ్లీష్. ఏం చదివారు?"

అమృతరావు చెప్పాడు.

"మీ పేరు?"

చెప్పాడు పొంగిపోతూ

విష్ యూ ఆల్ ది బెస్ట్. మిస్టర్ అమృతరావ్!".

గాల్లో తేలుతున్నట్టు నడిచివచ్చి సీట్లో కూర్చున్నాడు. అతని మొహం ఆర్క్ లాంప్‌లా దేదీప్యమానంగా వెలిగిపోతోంది.

"ఏం జరిగింది?" అనుమానంగా అడిగాడు సూపరింటెండెంట్ పెరుమాళ్ళు.

ఆయనకి కలెక్టరుగారంటే చచ్చే భయం.

నలుగురు టైపిస్టులు కూడా చుట్టూ చేరారు.

అమృతరావు జరిగింది చెప్పాడు. అందరూ అభినందించారు అతన్ని.

ఆరోజు సాయంత్రం నాలుగింటికి కలెక్టరుగారి దగ్గర్నుంచి వచ్చిన ఆకుపచ్చని సిరాతో వ్రాసివున్న నోట్‌ను చూసి సెక్షన్ సూపరింటెండెంటు పెరుమాళ్లు గుడ్లు తేలవేశాడు.

అందు వున్నవి రెండే మాటలు.

"ట్రాన్స్‌ఫర్ శ్రీ వి. అమృతరావ్ టు తిరువూరు. రిలీవ్ హిమ్ టు డే."